క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం 11కేవీ జయ శ్రీకాలనీ, 11కేవీ ఆర్ఎస్‌రెడ్డినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ ఎస్.ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జయశ్రీకాలనీ, సర్వోదయనగర్, ప్రగతినగర్, మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం, స్వాగత్‌హోటల్, మీర్‌పేట ప్రధాన రహదారి, సీతాహోమ్స్, శివాజీనగర్, ఆర్.ఎస్.రెడ్డికాలనీ, ద్వారకామయినగర్, మధురానగర్, మీర్‌పేట విలేజ్, లక్ష్మీనగర్, ఆదర్శహిల్స్, రాఘవనగర్, గణేష్‌నగర్, ఆదిత్యనగర్ కాలనీలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల విద్యుత్‌కు సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

14న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశాన్ని హుడాకాంప్లెక్స్‌లోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, టెక్నికల్ మెంబర్లు, ఫైనాన్స్, కన్జ్యూమర్ ఎఫైర్స్ మెంబర్లు హాజరవుతారని, దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతో పాటు బిల్లుల్లో హెచ్చుతగ్గులపై ఫిర్యాదులు చేసి పరిష్కారం పొందాలని సూచించారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. యాభై ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనానికి అధికారులు మరమ్మతులు చేయక పోవడంతో పూర్తిగా దెబ్బతిన్నది. ప్రస్తుతం ఈ భవనం నిరుపయోగంగా ఉంది. దీంతో పిచ్చి మొక్కలు పెరిగాయి. ఈ భవనంలో విష పురుగులు సంచరిస్తున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాక ముందే అధికారలు స్పందించి పాత భవనాన్ని కూల్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కందుకూరు: మండల పరిధిలోని సార్లరావులపల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ రజితప్రవీణ్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కందుకూరు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కడ్తాల్ జెడ్పీటీసీ దశరథ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్, మండల యూత్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి తదితరులు భూమి పూజ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవిత, వార్డుసభ్యులు సామ్య, గౌతమి, నాయకులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే దుకాణాలు సీజ్

మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

ఇబ్రహీంపట్నం: పన్నులు సకాలంలో చెల్లించకుంటే దుకాణాలను సీజ్ చేస్తామని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ హెచ్చరించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పన్ను వసూళ్ల స్పెషల్ డ్రైవ్‌లో సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. పన్నులు చెల్లించకుండా ఏడేళ్లుగా బకాయిపడ్డ ఓ షాపును సీజ్ చేశారు. పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

యాచారం: కొత్తపల్లి గ్రామంలోని బొక్కల కంపెనీని మూసేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేస్తున్న నిరాహార దీక్ష శుక్రవారానికి 9వ రోజుకు చేరింది. తొమ్మిదిరోజులుగా దీక్ష చేస్తున్నా అధికారుల్లో స్పందన లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కంపెనీని మూసేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో శుక్రవారం రాత్రి హైమాస్టు లైట్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో ఎమ్మెల్సీ బోగారపు దయానంద్ తన ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూర్ చేసిన రూ.5 లక్షలతో హైమాస్టు లైట్లను ఏర్పాటు చేశారు. మాజి ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి యాదయ్య, దస్తగిరి, ప్రకాశ్, అభిలాష్‌గౌడ్, శ్రీశైలం, రవి, సుదాకర్, ఆంజనేయులు, తిరుపతి పాల్గొన్నారు.

వేధిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది కొరత

- ఉన్నవారిపైనే పనిభారం
- సిబ్బంది నియామకంపై ఊసెత్తని అధికారులు, పాలకులు



మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం

మీర్‌పేట: గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ.. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా రూపాంతరం చెందినా.. ప్రస్తుత పారిశుద్ధ్య సిబ్బందిపై అధిక పనిభారం పడుతున్నా.. అదనపు సిబ్బంది నియామకంపై అధికార, పాలకవర్గం పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. వివరాల ప్రకారం.. మీర్‌పేట, జిల్లెలగూడ ప్రాంతాలు గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా, ఆ తరువాత కార్పొరేషన్‌గా ఏర్పాటైన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ కాలంలో ఉన్న సిబ్బందే ఇప్పటివరకు కొనసాగుతూ వస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లో దాదాపు 180 వరకు కాలనీలు వెలియడంతో పాటు లక్షకు పైగా జనాభా కలిగి ఉంది. కాలనీలు పెరిగాయి.. జనాభా కూడా పెరిగింది.. అదే విధంగా పారిశుద్ధ్య సిబ్బందిపై పనిభారం కూడా ఎక్కువైంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాల్సి ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని, దీంతో రోజు రోజుకు తమపై పనిఒత్తిడి పెరుగుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్న సిబ్బందిపైనే అధిక భారం..

కార్పొరేషన్‌కు 300 మంది సిబ్బంది అవసరం ఉండగా ప్రస్తుతం 130 మంది మాత్రమే ఉన్నారు. గ్రామ పంచాయతీ నుంచి అదనపు సిబ్బందిని నియమించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు పట్టించుకున్న దాఖలాలే లేవని పారిశుద్ధ్య సిబ్బంది తెలిపారు. సిబ్బంది కొరత అధికంగా ఉండడంతో ఉన్న వారిపైనే అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య సమస్యలపై ప్రతిరోజు ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయని, తప్పని పరిస్థితుల్లో ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నామని సూపర్‌వైజర్లు తెలిపారు. అదనంగా సిబ్బందిని నియమిస్తున్నామని పలుమార్లు అధికారులు చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదని, పెరిగిన కాలనీలు, జనాభాను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అదనపు సిబ్బందిని నియమించేలా అధికారులు, పాలకులు చొరవ తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

> **సిబ్బందిని నియమిస్తాం**
>
> 
>
> మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు పారిశుద్ధ్య సిబ్బందిపై పనిభారం తగ్గించేందుకు 46 మంది అదనపు సిబ్బందిని నియమించాలని తీర్మానించి నిర్ణయం తీసుకున్నాం. త్వరలోనే సిబ్బందిని నియమిస్తాం.
>
> – దుర్గాదీప్‌లాల్, మేయర్, మీర్‌పేట కార్పొరేషన్

గ్రీన్ జోన్ ఎత్తి వేయాలని వినతి

బడంగ్‌పేట్: పట్టణ పరిధిలోని అల్మాస్‌గూడలో చాలా కాలనీలు గ్రీన్ జోన్‌లో ఉన్నాయని, వాటిని రెసిడెన్సియల్ జోన్‌లోకి మార్చాలని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నేత రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, భూ యజమానులు కలిసి శుక్రవారం కలెక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి సూచన మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. అల్మాస్‌గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 122, 123, 124, 129లో వెయ్యి కుటుంబాలు గ్రీన్ జోన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సర్వే నంబర్లలో సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోవడానికి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని తెలిపారు. గతంలో పంచాయతీ అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న వారు అదనపు అంతస్తుల నిర్మించుకోవడానికి అనుమతులు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రీన్ జోన్ పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వ బ్యాంకుల్లో గృహ రుణాలు రావడం లేదని, ప్రైవేట్ బ్యాంకుల్లో అధిక వడ్డీకి రుణాలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. పిల్లల చదువుల కోసం, వివాహాల కోసం ఖాళీ స్థలాలు కొన్నారని, ప్రస్తుతం వాటి విలువ భారీగా పడిపోయిందన్నారు. గ్రీన్ జోన్ ప్రాంత వాసులు అన్ని ప్రాంతాల వారితో సమానంగా పన్నులు కడుతున్నా అనుమతుల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చినా పరిష్కారం కాలేదని తెలిపారు. కార్యక్రమంలో ఏ మోహన్, ఆర్ మాధవరెడ్డి, జే శశికాంత్, వీరాచారి, బహుగుణనాయక్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న, డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ నేతలు

బడ్జెట్‌తో జనానికి ఒరిగిందేమీ లేదు

ఎంసీపీఐయూ నేతలు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

బడంగ్‌పేట్: రాజకీయ ప్రయోజనాల కోణంలోనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బడ్జెట్ ప్రవేశపెట్టాయని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి రావుల ఝాన్సీ, విద్యార్థి సమైఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.భానుప్రసాద్ విమర్శించారు. ఎంసీపీఐయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ జనార్దన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ జనాభా దామాషాను విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారి వర్గాల ప్రయోజనాలు కాపాడే విధంగా ఆర్థిక అసమానతలు పెంచే విధంగా ఉందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ కేవలం అంకెల గారడని అన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌ల వల్ల సామన్య, మధ్యతరగతికి ఏలాంటి ఉపయోగం లేదని అన్నారు. కార్యక్రమంలో ఏంసీపీఐయూ నాయకులు, మహిళలు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గ్రేటర్‌కు నిధులు కేటాయించాలి

- కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి డిమాండ్
- అసెంబ్లీ ముట్టడికి యత్నం.. అరెస్టు

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి నగర శివార్ల అభివృద్ధికి సహకరించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి డిమాండ్ చేశారు. శుక్రవారం సరూర్‌నగర్ సర్కిల్, ఎల్‌బీనగర్ సర్కిళ్లకు చెందిన బీజేపీ కార్పొరేటర్లు అసెంబ్లీని ముట్టడించేందుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ మిగులు బడ్జెట్ ఉన్న దానిని రూ.6 వేల కోట్లకు పైగా అప్పులకుప్పగా చేసి రోజు రోజుకు కోటి 30 లక్షల రూపాయల వడ్డీ కడుతున్నారని తెలిపారు. విశ్వనగరమని గొప్పగా చెప్పుకునే ప్రభుత్వం..రూ.31 కోట్ల బడ్జెట్‌ను గ్రేటర్‌కు కేటాయించడమేమిటని , కేవలం అధికారుల జీతాలకే సరిపోతుందన్నారు. రాష్ట్రం ప్రభుత్వ ఆదాయానికి జీహెచ్ఎంసీ గుండెకాయ లాంటిదన్నారు. గత రాత్రి నుంచే పోలీసులు ముందస్తు అరెస్టులకు సిద్ధమయ్యారని, వాటన్నింటినీ తప్పించుకొని ఎన్ని ఆంక్షలు విధించినా అసెంబ్లీ గేటును తాకామని, ఇది తమ విజయమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని, ఎన్ని అరెస్టులు చేసినా భయపడబోమని స్పష్టం చేశారు. ప్రజలు తమపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా అభివృద్ధి కోసం నిరంతరం ప్రభుత్వంపై పోరాటం చేస్తామని చెప్పారు. తమను అరెస్టు చేసి ముషీరాబాద్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల బీజేపీ కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.



ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కార్పొరేటర్లు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయండి

ఎంపీపీ రఘుమారెడ్డి

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు
- 17 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

మహేశ్వరం: పట్టణంలోని శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎంపీపీ, ఆలయ చైర్మన్, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పటిష్టమైన పోలీసు బందోబస్తు కల్పిస్తామన్నారు. ఈసారి భక్తుల రద్దీ పెరిగే ఆవకాశం ఉన్నందున ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆలయం చుట్టూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునిత నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఎంపీడీఓ నర్సింహ, తహసీల్దార్ మహమూద్ అలీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మహేశ్వరం సీఐ మధుసూదన్, దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్ ఎం నవీన్, మండల కోఆప్షన్ సభ్యుడు అదిల్ అలీ, డైరెక్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ రఘుమారెడ్డి తదితరులు

సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర

బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్ కుమార్‌రెడ్డి

మంచాల: నియోజకవర్గంలోని ప్రజాసమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా పనిచేయడం కోసమే ప్రగతి నివేదన పాదయాత్ర చేపట్టినట్లు బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మంచాలలో ప్రగతి నివేదన పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా..? లేదా తెలుసుకోవడానికే గడప–గడపకు తిరుగుతున్నామన్నారు. మంచాల గ్రామంలో రూ.10లక్షతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 80 వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ నర్మద, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పావని వెంకటేశ్, జానీపాష, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు భద్రినాథ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంట విజయ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సికిందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



తలకొండపల్లి: స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 17మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవరించారు. ప్రధానోపాధ్యాయులుగా బి.పావని, డీఈఓగా పి.చందన వ్యవహరించారు. అనంతరం సమావేశంలో విద్యార్థులు మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని.. భవిష్యత్‌లో ఉపాధ్యాయులు కావాలనే కోరిక ఉందని అన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకరయ్య, కర్ణారెడ్డి, గోపాల్, పీఈటీ మల్లేష్, సతీష్, బాలస్వామి, స్వాతి, శంకర్, ఎస్ఎంసీ చైర్మన్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

అరబిందో హైస్కూల్‌లో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని అరబిందో హైస్కూల్‌లో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. విద్యాశాఖామంత్రిగా శ్రవన్‌కుమార్, విద్యాశాఖ కమిషనర్‌గా శ్రావణి, కలెక్టర్‌గా అక్షిత, జాయింట్ కలెక్టర్‌గా శ్రీవర్ష, డీఈఓగా స్రవంతి, డిప్యూటీ డీఈఓగా పవన్, ఎంఈఓగా కీర్తిశ్రీ, ఆర్‌జేడీగా రాంచరణ్, పాఠశాల ప్రిన్సిపాల్‌గా చిన్మయి, వైస్ ప్రిన్సిపల్‌గా సాయిచరణ్, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్లోక, అకడమిక్ అడ్వయిజర్‌గా కీర్తన వ్యవహరించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమనగల్లు సీఐ ఉపేందర్, ఎంఈఓ సర్దార్‌నాయక్.. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అరబిందో హైస్కూల్ అకాడమిక్ అడ్వయిజర్ సుధీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని గేటుతండాకు చెందిన జగదీశ్ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓవైసీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, పంతునాయక్.. జగదీశ్‌ను పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.8వేలను వారు బాధితుడికి అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రవి, తావుర్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి

మంచాల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంచాల జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని రంగాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.4.50లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అదేవిధంగా శ్మశానవాటిక వద్ద నీటి సదుపాయం కోసం రూ.1.05లక్షతో బోరు వేయించారు. ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మమత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి పెళ్లికి చేయూత

యాచారం: గ్రామంలోని నిరుపేదలకు అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతినాయక్ అన్నారు. గ్రామానికి చెందిన రమావత్ శారద, నారాయణ దంపతుల కూతురు ధనలక్ష్మీ పెళ్లి వేడుక శనివారం జరగనుంది. శారద, నారాయణ దంపతుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం గ్రామంలోని వారింటికి వెళ్లి ఒక పట్టు చీర, క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌నాయక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు అఖిల్‌ఖాన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా భూసేకరణ పెద్ద కుంభకోణం

యాచారం: ఫార్మాసిటీ భూసేకరణలో పెద్ద కుంభకోణం జరిగిందని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి ఆరోపించారు. యాచారంలోని శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేసిన యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 591 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమణ కింద చూపించి బినామీ పేర్లతో రూ.35 కోట్ల నిధులు స్వాహా చేసినట్లు ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద రూ.8 లక్షలకు ఎకరా అసైన్డ్ భూమి కొనుగోలు చేసిన ప్రభుత్వ పెద్దలు.. వ్యాపార సంస్థలకు ఎకరాకు రూ.కోటి 30 లక్షలకు అమ్ముకున్నట్లు ఆరోపించారు. ఫార్మాసిటీ భూసేకరణలో జరిగిన అక్రమాలను, ధరణి పోర్టల్‌లో జరిగే తప్పిదాలను సరిచేయకపోతే భూబాధితులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



ఇబ్రహీంపట్నం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

- బీజేపీ రాష్ట్ర పార్లమెంటరీ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం
- ప్రజాగోస – బీజేపీ భరోసా సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, సంక్షేమ పథకాల్లో కేంద్ర వాటాపై ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆపార్టీ రాష్ట్ర పార్లమెంటరీ సెక్రెట్రీ బాలసుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో శుక్రవారం 'ప్రజాగోస–బీజేపీ భరోసా' శక్తి కేంద్రం కార్నర్ సమావేశం విట్టల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముందుగా గ్రామంలో బీజేపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి బాలసుబ్రహ్మణ్యం, దేవయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలయజేయాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీకి వస్తున్న నిధుల్లో కేంద్రం వాటా ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రబారీ అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పోరెడ్డి నర్సింహారెడ్డి, అర్జున్ రెడ్డి, కొత్త అశోక్‌గౌడ్, మండల అధ్యక్షులు శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ యాదిరెడ్డి, నాయిని సత్యనారయణ, నారాయణ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మండల, బూత్‌స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తాం..

ఆమనగల్లు: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావ్ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయమని ఆయన అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సమావేశానికి మాజి ఎమ్మెల్సీ రామచందర్‌రావ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రామచందర్‌రావ్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ హామీలను విస్మరించిందన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. నియంత పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డి, బీజేపీ కల్వకుర్తి ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, కోకన్వీనర్ నర్సింహ, నాయకులు తిప్పిరెడ్డిరాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంపాల్‌నాయక్, కాసుల వెంకటేష్, లక్ష్మణ్‌రావ్, ఎర్రవోలు శ్రీను, శ్రీను, కొమరయ్య, రాఘవ పాల్గొన్నారు.

నూతన వధువులకు పెళ్లికానుక

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు గ్రామంలో వివాహం చేసుకునే అమ్మాయిలకు ఎన్నికల హామీలో భాగంగా రూ.10116 నగదును వివాహ కానుకగా ఇస్తున్నారు. ఇప్పటివరకు గ్రామంలో వివాహం జరిగిన 56 మంది వధువులకు పెళ్లికానుక అందించారు. గ్రామానికి చెందిన మంజుల, రాములు దంపతుల కుమార్తె పూజకు.. బక్కమ్మ, రామచంద్రయ్యగౌడ్ కుమార్తె శిరిషకు శుక్రవారం సర్పంచ్ దంపతులు రూ.10116 చొప్పున పెళ్లికానుకగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటయ్య, స్థానిక నాయకులు రమేశ్, సాయిలు, వెంకట్, యాదయ్య, వెంకట్, నర్సింహ, పర్వతాలు, గణేశ్, రాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వధువుకు ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ దంపతులు